క్లుప్తంగా

20న మండల సర్వసభ్య సమావేశం

లక్కవరపుకోట: ఈ నెల 20న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఎస్. అప్పారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభంకానున్న సమావేశానికి అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని కోరారు. గత సమావేశంలో సభ దృష్టికి వచ్చిన సమస్యలపై తీసుకున్న పరిష్కార నివేదికలు తీసుకురావాలన్నారు. అలాగే సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

మెటీరియల్ పంపిణీ


విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న రామకృష్ణ

వేపాడ: మండలంలోని బొద్దాం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నవోదయ, సైనిక స్కూల్ ఎంట్రన్స్ పరీక్షలకు సంబంధించిన మెటీరియల్‌ను గ్రామానికి చెందిన జె. రామకృష్ణ సోమవారం పంపిణీ చేశారు. 39 మంది విద్యార్థులకు మెటీరియల్ అందజేసినట్లు చెప్పారు.

వినతి

గజపతినగరం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సుమారు మూడు నెలలు మాత్రమే రేషన్ డిపోలో బియ్యం, కందిపప్పు ఇచ్చారని.. తర్వాత నుంచి కందిపప్పు ఇవ్వడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు ఎం.భాస్కర రావు అన్నారు. లబ్ధిదారులకు కందిపప్పు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ బి. రత్నకుమార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు.

సోంపురంలో కార్డన్ సెర్చ్

వేపాడ: మండలంలోని సోంపురంలో ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, వల్లంపూడి ఎస్సై సుదర్శన్ నేతృత్వంలో సిబ్బంది సోమవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో తనిఖీలు నిర్వహించగా.. గ్రామానికి చెందిన గొర్లె సింహాచలం వద్ద 3,220 రూపాయల విలువగల మందు గుండు సామాన్లు దొరికినట్లు చెప్పారు. ఎస్సై సుదర్శన్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

దత్తిరాజేరు: మండల పరిధిలోని అంగన్‌వాడీ చిన్నారులు, పాఠశాలల విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు కె. కొత్తవలస, దత్తిరాజేరు పీహెచ్‌సీల వైద్యాధికారులు రఘు, వెంకటరమణ తెలిపారు. ఈమేరకు ఆయా పీహెచ్‌సీల వద్ద డీ వార్మింగ్ డే వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. మండలంలో 5321 మంది విద్యార్థులు, చిన్నారులచే మాత్రలు మింగిస్తామన్నారు.

స్వీయ రక్షణపై అవగాహన


శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ట్రైనర్ శ్రీనివాసరావు స్వీయ రక్షణపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలికలు, మహిళలు అపద సమయాల్లో ఎలా వ్యవహరించాలో వివరించారు. కార్యక్రమంలో ఎస్.కోట పోలీసులు పాల్గొన్నారు.

నాటు తుపాకులు కలిగి ఉండరాదు

- సీఐ రమణ

గజపతినగరం రూరల్: ఎట్టి పరిస్థితుల్లోనూ నాటు తుపాకీలు కలిగి ఉండరాదని స్థానిక సీఐ రమణ తెలిపారు. మండలంలోని ఎం. కొత్తవలసలో సర్కిల్ పరిధిలోని ఐదు స్టేషన్ల సిబ్బందితో సోమవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి సోదాలు చేపట్టారు. అనంతరం ఆయన గ్రామస్తులతో మాట్లాడుతూ..ఎవరి దగ్గరైనా నాటు తుపాకులుంటే తమకు తెచ్చి ఇవ్వాలన్నారు. స్వచ్ఛందంగా అప్పగిస్తే ఎటువంటి కేసులు ఉండవని.. తర్వాత పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, ఆండ్ర స్టేషన్ల ఎస్సైలతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గొభ్యాం వద్ద కుంగిన రోడ్డు


గొభ్యాం వద్ద కల్వర్టుపై తారు రోడ్డు కిందకు జారడంతో రక్షణగా వేసిన ఇసుక బస్తాలు, ముళ్ల కంపలు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి – పోరళి రోడ్డులో గొభ్యాం వద్ద బీటీ రోడ్డు కుంగిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈరోడ్డుపై నిత్యం వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో వాహనదారులను అప్రమత్తం చేసేందుకు అధికారులు కుంగిన ప్రాంతం వద్ద ఇసుక బస్తాలు, ముళ్ల కంపలు పెట్టారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ జేఈ అజయ్‌భార్గవ్ వద్ద ప్రస్తావించగా.. త్వరలోనే మరమ్మతులు చేపడతామన్నారు.

ఖరీఫ్ ఆశలు ఆవిరి..

- కొన్ని రోజులుగా కానరాని వర్షాలు
- వాడిపోతున్న మెట్టు పంటలు
- ఆశలు వదులుకుంటున్న రైతులు
- మండలంలో 1052 హెక్టార్లలో మొక్కజొన్న, 1044 హెక్టార్లలో వరి సాగు


వర్షాలు లేక వాడిపోతున్న మొక్కజొన్న

చీపురుపల్లి రూరల్ (గరివిడి):

ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో మెట్టు పంటలపై ప్రభావం ఎక్కువగా పడింది. పంట దశలోకి చేరుకునేసరికి వర్షాలు మొహం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మొవ్వ దశలో వర్షాలు కురవకపోతే తర్వాత వర్షాలు కురిసినా ప్రయోజనం ఉండదని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో భాగంగా గరివిడి మండల వ్యాప్తంగా 1052 హెక్టార్లలో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు. ఈ పంటతో పాటుగా వేరుశనగ, అపరాలైన పెసర, మినుము, కందితో పాటు వాణిజ్య పంటలైన బొప్పాయి, మిరప, తదితర పంటలను సాగు చేస్తున్నారు. ఖరీఫ్ ఆరంభంలో వర్షాలు కురవడంతో రైతులు ఎంతో ఆనందంగా పంటల సాగుకు ముందుకువచ్చారు. ప్రస్తుతం మొక్కజొన్న, వేరుశనగ, పెసర, మినుము పంటలు మధ్యస్థ దశలోకి వచ్చాయని రైతులు చెబుతున్నారు. పంటల దిగుబడికి ఇదే సరైన సమయమని.. ఈ సమయంలో సక్రమైన వర్షాలు కురిస్తే పంటల దిగుబడి అనుకూలంగా ఉంటుంది. అయితే ప్రస్తుతం వర్షాలు కురవకపోవడంతో పాటు వేసవిని తలపించే ఎండలు కాస్తుండడంతో పంటలన్నీ వాడిపోయే దశకు చేరుకున్నాయి. ఇప్పటికే వేలాది రూపాయల అప్పులు చేసి మదుపులు పెట్టి ఆశతో ఎదురు చూస్తున్న రైతుకు వర్షాభావ పరిస్థితులు నిరాశను మిగిల్చాయి. ఇదిలా ఉండగా ఖరీఫ్‌లో అనుకూల వర్షాలు లేకపోయినప్పటికీ ఉన్నపాటి కొద్దిపాటి నీరును అదునుగా చేసుకుని 1044 హెక్టార్లలో వరి సాగు చేశారు. కొంతమేర సాగుచేసిన వరిపైరుపై కూడా ఈ ఎండల ప్రభావం ఉందని రైతులు చెబుతున్నారు.

దిగుబడిపై ప్రభావం..

“ మరో వారం రోజుల పాటు వర్షాలు లేకపోతే మెట్టు పంటల దిగుబడి బాగా తగ్గిపోయే అవకాశం ఉంది. ప్రస్తుతం పంట దశలో ఉన్న మొక్కకు నీరు చాలా అవసరం. వర్షాలు లేకపోతే మొక్కజొన్న పొత్తులో పెరుగుదల లోపించి చిన్నపాటి వెన్ను వస్తుంది. వరిపైరు కూడా దెబ్బతినే అవకాశం ఉంది. – పి.ప్రసాదరావు, మండల వ్యవసాయాధికారి

సర్వీస్ రోడ్డు వేసిన తర్వాతే పనులు చేపట్టండి..

- ఆర్‌ఓబీ పనులు అడ్డుకున్న రిక్షా కాలనీ వాసులు

సాక్షి ఎఫెక్ట్...


రిక్షాకాలనీ వాసులు పనులు అడ్డుకోవడంతో నిలిచిపోయిన జేసీబీ యంత్రం

చీపురుపల్లి: తమ కాలనీకి సర్వీస్ రోడ్డు వేసిన తర్వాతే ఆర్‌ఓబీ పనులు పునఃప్రారంభించాలని మేజర్ పంచాయతీ పరిధిలోని రిక్షా కాలనీ వాసులు స్పష్టం చేశారు. చీపురుపల్లి – రాజాం రోడ్డులో కొన్నాళ్లుగా నిలిచిపోయిన ఆర్‌ఓబీ పనులను సంబంధిత కాంట్రాక్టర్లు తిరిగి సోమవారం పునఃప్రారంభించారు. దీంతో కాలనీవాసులు కొంతమంది అక్కడకు చేరుకుని తమ కాలనీకి సర్వీస్ రోడ్డు సంగతి తేల్చాలని.. అంతవరకు పనులు జరగనివ్వమని అడ్డుకున్నారు. దాదాపు మూడేళ్లకు పైగా ఆర్‌ఓబీ పనులు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై ఈ నెల 10న సాక్షి పత్రికలో 'నత్తనడకన పనులు' అనే శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. అలాగే రిక్షా కాలనీ వాసులు సర్వీస్ రోడ్డు వేయాలని అధికారులు, పాలకు దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని కూడా కథనంలో పొందుపరిచడం జరిగింది. ఈ నేపథ్యంలో ఆర్‌ఓబీ గోడ పనులు చేపట్టేందుకు జేసీబీ యంత్రాలను మెయిన్‌రోడ్‌లో సోమవారం సిద్ధం చేశారు. దీంతో రిక్షాకాలనీ వాసులు అక్కడకు చేరుకుని పనులను అడ్డుకున్నారు. ముందు పనులు పూర్తి చేసి ఆ తర్వాత సర్వీస్ రోడ్డు వేస్తామని అధికారులు, ఇంజినీర్లు కాలనీవాసులకు నచ్చజెప్పినా వారు శాంతించలేదు. ముందు సర్వీస్ రోడ్డు వేసిన తర్వాతే మిగిలిన పనులు చేసుకోవాలని వారంతా స్పష్టం చేశారు. పోలీసులు రంగప్రవేశం చేసి పనులు ఆపొద్దని చెప్పినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. దీంతో పనులు నిలిచిపోయాయి.

రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో ఉపాధ్యాయులు

చీపురుపల్లి: రాష్ట్ర స్థాయిలో జరగనున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు మండలంలోని పెదనడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో సోమవారం ఆ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్రీడాకారులను ఆ పాఠశాల హెచ్‌ఎం ఎల్.తిరుపతిరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు ఎం.రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు. జిల్లాలోని ఎల్.కోటలో గల మోడల్ స్కూల్‌లో ఈ నెల 10న జిల్లా స్థాయి సబ్ జూనియర్స్, జూనియర్స్ బాల్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆ పోటీల్లో బి.జ్యోతి, బి.శ్రావణి, కోదండరామ్‌లు సబ్ జూనియర్స్ విభాగంలోను.. బి.విష్ణు జూనియర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆగస్టు 28, 29, 30 తేదీల్లో ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లా తరఫున వీరు ప్రాతినిథ్యం వహించనున్నారు.

యూత్ రెడ్‌క్రాస్ ద్వారా సేవా కార్యక్రమాలు


వలంటీర్లకు టీ షర్టులు, క్యాప్‌లు పంపిణీ చేస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, తదితరులు

చీపురుపల్లి: యూత్ రెడ్‌క్రాస్ ద్వారా వలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లకు టీ షర్టులు, క్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 15న జిల్లా కేంద్రంలోని పోలీస్ గ్రౌండ్‌లో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవంలో స్థానిక కళాశాలకు చెందిన యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్లు 100 మంది పాల్గొంటారని తెలిపారు. వీరంతా వేడుకల్లో సేవలు అందిస్తారని చెప్పారు. కార్యక్రమంలో యూత్ రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ బి.విజయేశ్వరరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ కె.జ్వాలాముఖి, కామర్స్ అధ్యాపకుడు పి.మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి

- ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు


ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ శ్రీనివాసులనాయుడు

కొత్తవలస: కూటమి ప్రభుత్వ పాలనలో ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరిగిపోయిందని ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సోమవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేమయ్యారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ..ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న నూతన మూల్యాంకన పుస్తకం వలన ఎన్నో ఇబ్బందులు ఉన్నాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అన్ని పరీక్షలకు ఒకే పుస్తకంలో సమాధానాలు రాయడం సరికాదని అభిప్రాయపడ్డారు. దీనికి ఎమ్మెల్సీ స్పందిస్తూ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చీపురుపల్లి ఈశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని మహిళ మృతి


ముత్యాలమ్మ మృతదేహం వద్ద బోరున విలపిస్తున్న పెద్దల్లుడు (ఇన్‌సెట్లో) ముత్యాలమ్మ (ఫైల్)

డాబాగార్డెన్స్ (విశాఖ): బస్సు కోసం కాంప్లెక్స్‌లో వేచి ఉన్న మహిళ బస్సు ఢీ కొనడంతో మృతి చెందిన సంఘటన విశాఖలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. విజయనగరం జిల్లా శృంగవరపుకోటకు చెందిన గేదెల ముత్యాలమ్మ (47) తన గ్రామానికి వెళ్లేందుకు సోమవారం సాయంత్రం 4.30 గంటలకు విశాఖలోని ద్వారకా బస్టాండ్‌కు చేరుకున్నారు. ఎస్.కోట బస్సులు వచ్చే ప్లాట్‌ఫారం వద్ద ఆమె వేచి ఉన్నారు. సుమారు 4.50 గంటల ప్రాంతంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే పల్లెవెలుగు బస్సును (హైర్ బస్సు) డ్రైవర్ చంద్రరావు అతి వేగంగా ప్లాట్‌ఫాంపైకి పోనిచ్చాడు. ఈ క్రమంలో బస్సు కోసం వేచి ఉన్న ముత్యాలమ్మను ఢీకొనడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా.. మరో వ్యక్తి స్వల్పంగా గాయపడ్డాడు. పోలీసులు ముత్యాలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు.

మనుమడి అన్నప్రాసనకు వచ్చి..

ముత్యాలమ్మ గాజువాకలో నివాసముంటున్న తన పెద్ద కుమార్తె స్వాతి కుమారుడి అన్నప్రాసన కోసం గత శనివారం ఎస్.కోట నుంచి వచ్చారు. ఆమెతో పాటు బొబ్బిలిలో ఉండే చిన్న కుమార్తె శ్రావణి కూడా వచ్చింది. ఆదివారం స్వాతి కుమారుడి అన్నప్రాసన కార్యక్రమాన్ని సంతోషంగా జరుపుకున్నారు. సోమవారం ముత్యాలమ్మ, శ్రావణి ఇద్దరూ తిరిగి వెళ్లడానికి సాయంత్రం బస్టాండ్‌కు చేరుకున్నారు. ముత్యాలమ్మ తన చిన్న కుమార్తె శ్రావణిని బొబ్బిలి వెళ్లే బస్సులో ఎక్కించారు. శ్రావణి సుమారు 4.40 గంటలకు బయలుదేరి వెళ్లింది. ఆ తర్వాత ఎస్.కోట వెళ్లే బస్సు కోసం ముత్యాలమ్మ ప్లాట్‌ఫాం నంబర్ 25కు చేరుకున్నారు. చిన్న కుమార్తె బయలుదేరి వెళ్లిన పది నిమిషాలకే వేగంగా వచ్చిన బస్సు రూపంలో మృత్యువు ఆమెను కబళించింది.

వాడవాడలా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


జాతీయ జెండాలతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు


చీపురుపల్లి: జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

గుర్ల: మండలంలోని పున్నపురెడ్డిపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ చేపట్టారు. జాతీయ జెండా పట్టుకొని గ్రామంలోని వీధుల్లో తిరుగుతూ భారత్ మాతాకీ జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పి.కనకరాజు, బీజేపీ నేతలు మహేష్, శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చీపురుపల్లిలో..

చీపురుపల్లి: హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాలతో మండల కేంద్రంలో నిర్వహించిన ర్యాలీ విజయవంతమైంది. డివిజనల్ అభివృద్ధి అధికారి హేమసుందరరావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఐ.సురేష్ నేతృత్వంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీలో మండల పరిషత్, గ్రామీణ ఉపాధిహామీ పథకం, వెలుగు, తదితర శాఖల సిబ్బంది పాల్గొన్నారు. ఈ ర్యాలీ మెయిన్‌రోడ్, మూడు రోడ్ల జంక్షన్, గాంధీబొమ్మ జంక్షన్ మీదుగా సాగింది.

ప్రకృతి సాగు ప్రయోజనాలను వివరించండి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏడీఏ కోటేశ్వరరావు

- వ్యవసాయ శాఖ ఏడీఏ కోటేశ్వరరావు

చీపురుపల్లి: ప్రకృతి వ్యవసాయం సాగు చేయడం ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని వ్యవసాయశాఖ సబ్ డివిజనల్ ఏడీఏ ఎన్.కోటేశ్వరరావు అన్నారున. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో సబ్ డివిజన్ పరిధిలో గల చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల, నెలిమర్ల మండలాలకు చెందిన వ్యవసాయశాఖ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంపై మూడు రోజులు జరగనున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రస్తుత సమాజంలో ఎరువులు లేని ఆహారం తినేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు చెప్పారు. ఎరువులతో కూడిన ఆహారాలు తిని వ్యాధులకు గురవుతున్న నేపథ్యంలో మళ్లీ పూర్వపు అలవాట్ల కోసం అందరూ చూస్తున్నట్లు చెప్పారు. అంతేకాకుండా ప్రకృతి వ్యవసాయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఆర్జించవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో దిగుబడులు, మార్కెట్ అవకాశాలను కూడా వివరించాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీఎం స్వామినాయుడు, ఆర్‌టీఎల్ ప్రకాష్, ఐదు మండలాల వ్యవసాయాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరిదీ బాధ్యత

- ఎంపీడీఓ సతీష్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మండల స్థాయి అధికారులు

శృంగవరపుకోట: నులి పురుగుల నివారణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ ఎం.సతీష్ అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 'జాతీయ నులి పురుగుల నివారణం దినం'కు సంబంధించి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ విషయంలో సచివాలయ ఉద్యోగుల సహకారం తీసుకోవాలన్నారు. మండలంలో గల 95 ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లోని విద్యార్థులచే మాత్రలు మింగించాలని సూచించారు. అనంతరం ఆల్బెండజోల్ మాత్రల ఆవశ్యకతను వివరించే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ విజయలక్ష్మి, ఈఓపీఆర్‌డీ లక్ష్మి, డాక్టర్ హారిక, తదితరులు పాల్గొన్నారు.

మెనూతో పాటు రుచి తప్పనిసరి


జాకేరు పాఠశాలను సందర్శించిన ఎంఈఓ బాలభాస్కరరావు

వేపాడ: మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించడంతో పాటు ఆహార పదార్థాలు రుచికరంగా ఉండేలా చూడాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండలంలోని జాకేరు ఎంపీయూపీ పాఠశాల, బక్కునాయుడుపేట ఏపీ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సోమవారం ఆయన సందర్శించారు. జాకేరు పాఠశాలలో జరుగుతున్న ఎఫ్ఏ 1 పరీక్షలను పరిశీలించారు. గదులు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. బక్కునాయుడుపేట పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, మెనూ తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.

యూరియా పంపిణీ

వేపాడ: మండలంలోని శింగరాయి గ్రామంలో మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు చేతులమీదుగా సోమవారం యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయకుడు ఎం. శివరామ్ మాట్లాడుతూ..యూరియాను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.
నానో యూరియా, డీఏపీలతో దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. కార్యక్రమంలో నీటిసంఘ అధ్యక్షుడు నిరుజోగి అమ్మతల్లినాయుడు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు దుల్ల వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

గజపతినగరం: కొత్త శ్రీరంగరాజపురంలో ఆరు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ బి.రత్నకుమార్ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ముందస్తు సమాచారం మేరకు దాడులు చేపట్టడగా.. యిజ్జిరోతు సత్యం అప్పలనాయుడికి చెందిన ఐదు ట్రాక్టర్లు, యిజ్జిరోతు చిన్నంనాయుడుకు చెందిన ఒక ట్రాక్టర్ పట్టుబడిందన్నారు.

మోసానికి మారుపేరు చంద్రబాబు

- బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో కడుబండి


శృంగవరపుకోట: ఎస్‌జీ పేటలో ప్రజలకు కూటమి మోసాలు వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


మెరకముడిదాం: సిరిదేవీపురంలో ఇంటింటికి వెళ్లి బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

శృంగవరపుకోట: మోసం, దగా, కుట్రలకు మారుపేరు చంద్రబాబునాయుడని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ఆరోపించారు. మండలంలోని ఎస్‌జీ పేటలో పార్టీ మండల అధ్యక్షుడు మోపాడ కుమార్ నేతృత్వంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, తదితరులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన మేనిఫెస్టో వారికి వివరించి సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడం వల్ల ఎంత నష్టపోయినదీ తెలియజేశారు. ఈ సందర్భంగా కొన్ని చోట్ల మహిళలు తల్లికివందనం, ఆడబిడ్డ నిధి వంటి పథకాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కడుబండి స్పందించి వైఎస్సార్‌సీపీ హయాంలో శతశాతం సంక్షేమ పథకాలు అందజేశామన్నారు. ప్రజల పక్షాన పోరాడేందుకు వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు మమ్ములూరి వెంకటలక్ష్మి, వాకాడ రాంబాబు, పోతనాపల్లి సర్పంచ్ కె.వెంకటరావు, గోగాడ శ్రీను, గేదెల నాయుడు, గోగాడ అప్పారావు, ఆర్.నాయుడు, చలుమూరి అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మోసగాళ్లకు మోసగాడు..

మెరకముడిదాం: మోసగాళ్లకు మోసగాడు చంద్రబాబునాయుడని వైఎస్సార్‌సీపీ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, డీసీఎంఎస్ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, కోట్ల విశ్వేశ్వరరావు, బూర్లె నరేష్ కుమార్ అన్నారు. మండలంలోని సిరిదేవీపురం గ్రామంలో పర్యటించి కూటమి మోసాలను ప్రజలకు వివరించారు. గ్రామాల్లోకి వచ్చే కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ అప్పలనాయుడు, పార్టీ నాయకులు శనపతి లోకేష్, సీహెచ్ చిరంజీవిరావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ..

వేపాడ: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు, పార్టీ మండల పార్టీ ముమ్ములూరి జగ్గుబాబు నేతృత్వంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. రామస్వామిపేట, పీకేఆర్ పురం, కొండగంగుబూడి గ్రామాల్లో ఇంటింట ప్రచారం నిర్వహించి వైఎస్సార్‌సీపీ పాలనకు కూటమి పాలనకు తేడా వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, మండల నాయకులు మురిపిండి గంగరాజు, స్వర్ణపూడి వెంకటరమణ, మండల యూత్ అధ్యక్షుడు ఉగ్గిన శ్రీను, నాగిరెడ్డి కనకరాజు, మెరపల సత్యనారాయణ, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.


వేపాడ: పీకేఆర్ పురంలో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు